క్లుప్తంగా

సూర్యారావుపాలెం ఆలయాల్లో హుండీ చోరీలు



సూర్యారావుపాలెం పంట కాల్వ బోదెలో దుండగులు పడేసిన హుండీ

ఉండ్రాజవరం: సూర్యారావుపాలెం గ్రామంలోని వివిధ ఆలయాల్లో గురువారం రాత్రి దుండగులు హుండీ చోరీలకు పాల్పడ్డారు. గ్రామస్తుల కథనం ప్రకారం, ఈ గ్రామంలోని సాయిబాబా, దుర్గమ్మ, పుంతలో ముసలమ్మ, కాపుల వినాయకుని ఆలయాల్లో దుండగులు సీసీ కెమెరాలను పగలగొట్టి భక్తులు హుండీల్లో వేసిన నగదును కాజేశారు. పగలగొట్టిన సాయి బాబా, కాపుల వినాయకుడి గుడి హుండీలు పక్కన ఉన్న పంట బోదెలో లభ్యమయ్యాయి. ఈనెల 26న దమ్మెన్ను కొండాలమ్మ ఆలయంలో కూడా దుండగులు గోడకు కన్నం పెట్టి లోపలికి ప్రవేశించి హుండీని పగలగొట్టి నగదును అపహరించుకుపోయారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మీసాల భాస్కరరావు మృతదేహం

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం వద్ద జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మీసాల భాస్కరరావు (54) అనే వ్యక్తి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ఉండ్రాజవరం మండలం కాల్దారికి చెందిన భాస్కరరావు కులవృత్తి నిమిత్తం తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో నివాసం ఉంటున్నాడు. గురువారం రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తూ దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద హైవేపై దిగి చిట్యాల నడుచుకుంటూ వెళుతున్నాడు. అదే సమయంలో ఏలూరు వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో భాస్కరరావుకు తీవ్ర గాయాలవగా చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

తండ్రి జ్ఞాపకార్థం వాటర్ ట్యాంకర్ వితరణ



పుల్లలపాడు పంచాయతీకి వాటర్ ట్యాంకర్ బహూకరిస్తున్న దాత పేరయ్య

నల్లజర్ల: మండలంలోని పుల్లలపాడుకు చెందిన పాడి రైతు కనికెళ్ళ రామయ్య ఇటీవల మృతి చెందారు. ఆయనకు విజయ డెయిరీలో బీమా ఉంది. దాంతో ఆ డెయిరీ సంస్థ రామయ్య కుటుంబానికి రూ.50 వేలు పరిహారంగా అందించింది. ఈ మొత్తానికి రామయ్య కుమారుడు పేరయ్య మరో రూ.లక్ష కలిపి తన తండ్రి జ్ఞాపకార్థం వాటర్ ట్యాంకర్‌ను తయారు చేయించారు. ఆ ట్యాంకర్‌ను పేరయ్య పుల్లలపాడు పంచాయతీకి విరాళంగా ఇచ్చారు. ఆ పంచాయతీ సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి ప్రసాద్ శుక్రవారం ఆ వాటర్ ట్యాంకర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో తాడిగడప శ్రీనివాసరావు, ముద్దన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చ గడ్డేసినా.. పైసలే సుమా

- ఏడాడికి ఎకరానికి రూ.30 వేలకు పైగా ఆదాయం
- తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల బెడద లేదు
- 800 ఎకరాల్లో సాగు



కాకరపర్రు వద్ద ఏటిగట్టుపై పెంచుతున్న చెంగల గడ్డి



ముక్కామల వద్ద పచ్చగడ్డి మోపులతో వస్తున్న పశుపోషకులు

పెరవలి: నమ్ముకున్న పంటలు నష్టాల పాలు చేసినా భూమినే నమ్ముకున్న అన్నదాతలు కుంగిపోలేదు. మరో రూపంలో పోయిన చోటే వెతుక్కోవాలని భావించారు. ఆఖరి ప్రయత్నంగా పచ్చగడ్డి సాగును ప్రారంభించారు.వారి కృషి ఫలించి, ఆశించిన దాని కంటే ఎక్కువ ఆదాయమే వచ్చింది. ఇప్పుడు పలువురు రైతులు పచ్చగడ్డి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఏ పంట వేసినా తెగుళ్లు, ప్రకృతి వైపరీత్యాల వలన ఎప్పుడు నష్టం వాటిల్లుతుందో అని భయపడాల్సిన పరిస్థితి ఈ ప్రాంత రైతులది. పచ్చగడ్డి సాగుతో అలాంటి భయాలేవీ అక్కర్లేదు. నికరంగా ఆదాయం వస్తోంది. అరటి, కంద, కూరగాయల తోటలు, వరి వంటి ఏ పంట వేసినా పరిస్థితులు అనుకూలిస్తే ఎకరానికి ఏడాదికి రూ.20 వేల నుంచి రూ.30 వేల ఆదాయం వస్తుంది. వాతావరణం అనుకూలించకపోయినా, ప్రకృతి కన్నెర్ర జేసినా వాణిజ్య పంటలు వేసిన వారు పెట్టుబడి కూడా కోల్పోయే పరిస్థితి నెలకొని ఉంది. అయితే పచ్చగడ్డి సాగు చేస్తే రూపాయి పెట్టుబడి లేకుండా ఏడాదికి రూ.30 వేల నికర ఆదాయం వస్తోంది.

గోదావరి లంకలు అనుకూలం

పెరవలి మండలంలోని కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, మల్లేశ్వరం, కడింపాడు గ్రామాల్లో సుమారు 800 ఎకరాల్లో గడ్డి సాగు చేస్తున్నారు. గడ్డి పెంపకానికి గోదావరి లంకలను రైతులు ఎంచుకోవడంతో వారికి మంచి ఆదాయం లభిస్తోంది. పెట్టుబడి అవసరం లేకుండా వేసవిలో కేవలం నీటి తడులు ఇస్తే సరిపోతుందని రైతులు చెబుతున్నారు. లంక పచ్చగడ్డికి మార్కెట్‌లో మంచి డిమాండ్ కూడా ఉంది. పశుపోషకులు ఇక్కడి గడ్డిని కొనుగోలు చేస్తుంటారు. ఈ ప్రాంతాల్లో సుమారు 800 ఎకరాల్లో పచ్చిక బయళ్లు ఉన్నాయి. దీనిని బట్టి రైతులకు ఆదాయం ఎలా సమకూరుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ రైతులు పచ్చగడ్డి అమ్మకాలను రెండు రకాలుగా విభజించారు. కోతకు ఒక ధర, ఏడాదికి ఒక ధరగా నిర్ణయించడంతో పశుపోషకులు తమ అనుకూలంగా వీటిని కొనుగోలు చేసుకుంటున్నారు. కోతకు గడ్డిని కొనే రైతులకు డిమాండ్‌ను బట్టి 10 సెంట్ల పచ్చిక బయళ్ళు రూ.1000 నుంచి రూ.1200 రేటుకు అమ్ముతున్నారు. ఏడాది పొడవునా కోత కోసుకునే రైతులు ఎకరం పచ్చిక బయలును రూ.30 వేలకు కొనుగోలు చేస్తున్నారు. లంకల పచ్చగడ్డిలో నాణ్యమైన చెంగల గడ్డి విస్తారంగా లభించడంతో దీనినే సాగు చేస్తున్నారు.ఏడాదికి ఒక ఎకరంలో పచ్చగడ్డి ఐదు కోతల దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. కోతకు విడిగా అమ్ముకుంటే ఎకరానికి కోతకు రూ.10 వేల చొప్పున వస్తుందని రైతులు వివరిస్తున్నారు.

ఇది కూడా వ్యాపారమే..



10 సెంట్లు పచ్చిక బయలు ఒకకోతకు కొనుగోలు చేస్తే రూ.1000 తీసుకుంటున్నారు. ఏడాదికైతే సమయాన్ని, డిమాండ్‌ను బట్టి రూ.30 వేల నుంచి రూ.40 వేలు తీసుకుంటున్నారు. దీనిని కూడా వ్యాపారంలా చేస్తున్నారు.

–ఉమ్మిడి వేణు, పశుపోషకుడు, ఉమ్మిడివారిపాలెం

వ్యవసాయం కన్నా ఇదే లాభసాటి



ఒక ఎకరం విస్తీర్ణంలో పచ్చగడ్డిని పెంచుతున్నాను. ఏడాదికి డిమాండ్‌ను బట్టి రూ.30 వేల నుంచి రూ.40 వేల ఆదాయం వస్తోంది. గోదావరికి వరదలు వచ్చినప్పడల్లా పంటలు కోల్పోతున్నాం. గడ్డి సాగు వల్ల ఎలాంటి పెట్టుబడి లేకుండానే ఆదాయం వస్తోంది. వ్యవసాయం కన్నా ఇదే లాభసాటిగా ఉంది.

– రేలంగి లక్ష్మణరావు రైతు, ముక్కామల

పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



కల్వర్టులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్లు

నిడదవోలు రూరల్: నిడదవోలు పట్టణాభివృద్ధికి ప్రణాళిక రూపొందించినట్టు మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో పట్టణంలోని 5,10 వార్డుల్లో చేపట్టే కల్వర్టులకు ఆదినారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, మహ్మద్ షకీరా, అహ్మదున్నీసాబేగం, ఆరుగొల్లు వెంకటేశ్వరరావు, ఉసురుమర్తి జాన్‌బాబు, మొదలవలస నాగమణి, దాకే అనిల్‌కుమార్, కమిషనర్ కేవీ పద్మావతి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు కృష్ణంపాలెంలో గడప గడపకూ..

దేవరపల్లి: గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం ఉదయం 9 గంటల నుంచి దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు.మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గోవాలని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి వీర వెంకట సతీష్ కోరారు.

తీరు మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు

- అవినీతి అధికారులకు మంత్రి వనిత హెచ్చరిక
- పలువురి మునిసిపల్ అధికారులపై తీవ్ర ఆరోపణలు చేసిన సభ్యులు
- విచారణ జరపాలని డిమాండ్



మునిసిపల్ సమావేశంలో హోం మంత్రి తానేటి వనిత, చైర్ పర్సన్ రత్నకుమారి



సమావేశానికి హాజరైన సభ్యులు

కొవ్వూరు: కొందరు కొవ్వూరు మునిసిపల్ అధికారుల అవినీతి విషయాలు తన దృష్టికి వచ్చాయని, ఇకనైనా వారు తీరు మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హోం మంత్రి తానేటి వనిత హెచ్చరించారు. కొవ్వూరు మున్సిపల్ బడ్జెట్, సాధారణ, అత్యవసర సమావేశాలను చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. మంత్రి వనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోదావరి బండ్‌పై ముళ్ల పొదలు, పిచ్చి మొక్కల తొలగింపు పనుల్లో మున్సిపల్ అధికారులు అవినీతికి పాల్పడ్డారని కౌన్సిల్ సభ్యులు కంఠమణి రమేష్, బత్తి నాగరాజు ఆరోపించారు. బాక్సు టెండర్లను నోటీసు బోర్డులో ఉంచకుండా కొందరు కాంట్రాక్టర్ల పేర్లతో ఐదుగురు మున్సిపల్ అధికారులే పనులు చేస్తున్నారన్నారు. ఆ వివరాలన్నీ తన వద్ద ఉన్నాయని, పేర్లతో సహా వెల్లడిస్తానని నాగరాజు అన్నారు. బాక్స్ టెండర్ల పేరుతో గత రెండేళ్లలో రూ.2 కోట్లకు పైగా పనులు చేశారన్నారు. సమగ్ర విచారణ జరిపాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య పనుల నిర్వహణలోనూ అక్రమాలు జరుగుతున్నాయని నాగరాజు అన్నారు. రెసిడెన్షియల్ పేరుతో అక్రమంగా కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్వహిస్తున్న వారికి అధికారులు కొమ్ము కాస్తున్నారన్నారు.

మునిపిపాలిటీలో పెద్ద స్కామ్ జరుగుతోందని ఆరోపించారు.అలాగే అధికారుల అక్రమాలపై మరో కౌన్సిలర్ రమేష్ ,టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని కూడా తీవ్ర విమర్శలు చేశారు. ఈ దశలో మంత్రి వనిత జోక్యం చేసుకుని అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు అడిగిన బాక్స్ టెండర్ల జాబితా తీసుకుని ఇకపై సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. క్షేత్ర స్థాయిలో సమగ్రంగా పరిశీలించి రోడ్డు మరమ్మతులకు సమగ్రంగా అంచనాలు తయారు చేసి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. మునిసిపాలిటీ అభివృద్ధికి నిధులు తీసుకొస్తామన్నారు. కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో అదనపు రైళ్ల హాల్ట్‌పై దృష్టి సారించామని చెప్పారు. మున్సిపల్ సాధారణ సమావేశం అజెండాలోని 18 అంశాలను, అత్యవసర సమావేశంలో ప్రతిపాదించిన నాలుగు అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్ చైర్‌పర్సన్ గండ్రోతు అంజనీదేవి, కౌన్సిలర్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.1.23 కోట్ల మిగులు బడ్జెట్ ఆమోదం

2023–24 సంవత్సరానికి కొవ్వూరు మున్సిపాలిటీకి రూ.1.23 కోట్ల మిగులు బడ్జెట్‌ను పాలకవర్గం ఆమోదించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆదాయం రూ.9.20 కోట్లుగాను, రూ.7.94 కోట్లు వ్యయం గాను చూపించారు. మూలధన ఆదాయం రూ.11.90 కోట్లు గాను, మూలధన వ్యయం రూ.13.82 కోట్లుగా పేర్కొన్నారు.

జమునతో అనంతపల్లికి అనుబంధం



అనంతపల్లిలో అప్పటి సమితి అధ్యక్షుడు కంఠమణి శ్రీనివాసరావు ఇంట్లో భోజనం చేస్తున్న జమున, జగ్గయ్య తదితరులు

నల్లజర్ల: శుక్రవారం ఉదయం దివంగతురాలైన అలనాటి నటీమణి జమునకు ఈ ప్రాంతంతో కొంత అనుబంధం ఉంది. ఏభై ఏళ్ళ క్రితమే నల్లజర్ల మండలం అనంతపల్లి గ్రామానికి ఆమె ×బంగారు తల్లి¤ సినిమా షూటింగ్ నిమిత్తం వచ్చారు. పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేస్తూ సాయంత్రానికి అప్పటి సమితి అధ్యక్షుడు కంఠమణి శ్రీనివాసరావు ఇంట బస చేసేవారు. దాదాపు నాలుగు రోజులు పాటు తమ ఇంట ఉన్నట్టు ఆయన కుమారుడైన కంఠమణి నారాయణ ప్రసాద్ గుర్తు చేసుకున్నారు. ఆమెతో పాటు నటుడు జగ్గయ్య ఇతర నటులు వచ్చారు. ప్రకాశరావుపాలెం గ్రామంలోని బైపాకం బయ్య జొన్న చేలో షూటింగ్ చేశారు. తమ తండ్రి కరుటూరి రామచంద్రానికి చెందిన యడ్లబండిపై జమునను తీసుకెళ్లే సన్నివేశాలను తీశారని ఆ గ్రామ పెద్ద కరుటూరి లక్ష్మీగణేశ్వరరావు గుర్తు చేశారు. ఆ తరం వారు ఆ సినిమా ముచ్చట్లు, సినీ నటి జమునను చాలా దగ్గర చూశామని ఆ గ్రామ మహిళలు వివరించారు. జమున మృతి యావత్ భారతీయ సినీ పరిశ్రమకు ఆమె మరణం లోటని నారాయణ ప్రసాద్ అన్నారు.

న్యాయవాది చామర్తి మృతికి సంతాపం



చామర్తి రాధాకృష్ణ (ఫైల్)

కొవ్వూరు: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది చామర్తి రాధాకృష్ణ మృతికి బార్ అసోసియేషన్, న్యాయమూర్తులు, న్యాయవాదులు తీవ్ర సంతాపం తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం సంతాపసభ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ, న్యాయమూర్తి జె.బాలాత్రిపుర సుందరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీరుకొండ సూర్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు నిమ్మగడ్డ పుల్లారావు, వల్లభనేని సుబ్బారావు, కేఎస్ రాఘవులు, ఈ.గోపాలకృష్ణ, చిట్టిబాబు తదితరులు రాధాకృష్ణ మృతికి ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలియజేశారు.

జాతీయస్థాయి క్రీడా పోటీలకు నలుగురి ఎంపిక



అంబటి రంజిత్‌ను అభినందిస్తున హెచ్ఎం శ్రీనివాస్, పీడీ వెంకటేశ్వరరావు



పి.యోషిత్‌తో ప్రిన్సిపాల్ కల్పనాసింగ్, కోచ్ లోకో



జాలాది మౌనిక మల్లవరం



గుడాల నాగభవాని ఊనగట్ల

నల్లజర్ల: అండర్– 14 జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టులో తమ పాఠశాల 8వ తరగతి విద్యార్థి పి.యోషిత్ ఎంపికైనట్టు తెలికిచెర్లలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి కల్పనాసింగ్ తెలిపారు. ఈనెల 20 నుంచి 22 వరకూ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన అంతర్ జిల్లాల అండర్–14 బాలుర ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న తమ స్కూల్ జట్టులోని యోషిత్ విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపియ్యాడన్నారు.

మల్లవరం, ఊనగట్ల బాలికలు

చాగల్లు: మండలంలోని మల్లవరం, ఊనగట్ల జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థినులు ఇద్దరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి 25 వరకూ కర్నూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో మల్లవరం హైస్కూల్ విద్యార్థిని జాలాది మౌనిక ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎ.చంద్రశేఖర్ తెలిపారు. త్వరలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో మౌనిక పాల్గొంటుందని తెలిపారు. అలాగే ఇటీవల అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన అండర్–17 రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఊనగట్ల హైస్కూల్ విద్యార్థిని గుడాల నాగభవాని విజయం సాధించిందని హెచ్ఎం టీఎస్ రామానుజం తెలిపారు. నాగభవాని త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

వాలీబాల్ జట్టుకు అంబటి రంజిత్

దేవరపల్లి: ఈ నెల 23 నుంచి 25 వరకూ కర్నూల్‌లో నిర్వహించిన అండర్–17 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన చిన్నాయగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి అంబటి రంజిత్ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్టు పీడీ ఆచంట వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో జిల్లా జట్టు ద్వితీయస్థానం సాధించినట్టు చెప్పారు. తొమ్మిదో తరగతి చదువుతున్న రంజిత్ త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కోట సత్తెమ్మకు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడి పూజలు



కోటసత్తెమ్మ వారి ఆలయ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, ధర్మకర్తలమండలి సభ్యులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మ వారిని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) పర్యవేక్షణలో శ్రీనివాస్‌నాయుడికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం కోట సత్తెమ్మ ఆలయానికి సంబంధించిన శాశ్వత, నిత్యఅభిషేకం, తారా బలముల క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు గాజుల రంగారావు, అయినీడి వెంకటకృష్ణ, మిద్దే శ్రీను, ప్రధానార్చకులు అప్పారావు శర్మ తదితరులు పాల్గొన్నారు.

అజ్జరం గంగాలమ్మకు..

పెరవలి: మండలంలోని అజ్జరం గ్రామదేవత గంగాలమ్మ జాతర సందర్భంగా అమ్మవారిని ఎమ్మెల్యే జి శ్రీనివాస్ నాయుడు శుక్రవారం దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళు సత్యనారాయణ, అజ్జరం సర్పంచ్ సుధ పాల్గొన్నారు.

ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీషు పుస్తకాలు



యర్నగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దాత రుషికేశవరావు

దేవరపల్లి: మండలంలోని గాంధీనగరానికి చెందిన అభ్యుదయ రైతు ఆచంట రుషికేశవరావు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు పుస్తకాలను ఉచితంగా అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చక్కటి ఆంగ్లం మాట్లాడాలనే సంకల్పంతో తాను ఈ పుస్తకాలు అందజేస్తున్నట్టు ఆయన తెలిపారు. యర్నగూడెంలోని బీజీ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం ఆయన ఈ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో పుస్తక రచయిత షేక్ అహ్మద్ బాషా, హెచ్ఎం శ్రీవాసవి తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



అన్నదేవరపేటలో మానవత సంస్థ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ విద్యార్థులకు అవగాహన

తాళ్లపూడి: బాల్యం నుంచే విద్యార్థులు నైతిక విలువలు పాటిస్తు సత్ ప్రవర్తన కలిగి ఉండాలని కెరీర్ గైడెన్స్ శిక్షణకుడు తాడేపల్లి మోహనరావు అన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్నదేవరపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్– నైతిక విద్య అనే అంశంపై శుక్రవారం అవగాహన కల్పించారు. మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తాడేపల్లి మోహనరావు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మధ్యలో విద్యార్థులను ప్రశ్నలు వేసి, సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందజేస్తూ ప్రోత్సహించారు. కార్యక్రమంలో మానవత సంస్థ రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, సభ్యులు సత్యనారాయణ, సాయన సుబ్బారావు, హెచ్ఎం అర్జునరావు, ఉపాధ్యాయుడు రమేష్ పాల్గొన్నారు.

చాగల్లులో వ్యక్తిత్వ వికాసంపై..

చాగల్లు: వ్యక్తిత్వ వికాసం, విద్య, ఉద్యోగావకాశాలపై చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ (కాకినాడ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఆ పాఠశాల హెచ్ఎం పి.వీర్రాజు తెలిపారు. ఉన్నత చదువుల వంటి పలు అంశాలపై రీసోర్స్ పర్సన్ వీవీఎస్ఎస్ శ్రీనివాస్ విద్యార్థులకు అవగాహన కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో సెట్రాజ్ మేనేజర్ కేఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావు, సీపీ సూర్యనారాయణ, కె.గౌతమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పురస్కారాల గ్రహీతలకు సన్మానం



కలవలపల్లిలో డాక్టర్ సౌజన్యను సత్కరిస్తున్న గ్రామస్తులు, వైద్య సిబ్బంది



వేగేశ్వరపురంలో పోశమ్మను సత్కరిస్తున్న సర్పంచ్ తదితరులు

చాగల్లు: రిపబ్లిక్ డే వేడుకల్లో జిల్లా కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా ఉత్తమ వైద్యాధికారి పురస్కారం అందుకున్న మండలంలోని కలవలపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.సౌజన్యను కలవలపల్లి గ్రామస్తులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. సౌజన్యను దుశ్శాలువా, పులమాలతో సన్మానించారు.

అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు..

తాళ్లపూడి: వేగేశ్వరపురం సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పోశమ్మకు రిపబ్లిక్ డే వేడుకల్లో ఉత్తమ ఉద్యోగి అవార్డు లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం ఆమెను ఘనంగా సత్కరించారు. సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశు రామారావు, కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో సత్కరించి అభినందనలు తెలిపారు.

కొత్త విద్యుత్తు స్తంభాల ఏర్పాటు

తాళ్లపూడి: మండలంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్త స్తంభాలను వేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ సీహెచ్ వెంకటరావు తెలిపారు. పలు గ్రామాల్లో స్తంభాలు పాడై ప్రమాద భరితంగా ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎల్‌టీ పోల్స్ 80, 11 కేవీ పోల్స్ 40 కొత్తవి వేస్తున్నట్టు వివరించారు.

కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

నిడదవోలు రూరల్: అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ శుక్రవారం తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన తిరుమలశెట్టి లలితకు చాగల్లుకు చెందిన కృపానందంకు గతంలో వివాహమైంది. ఇటీవల తన భర్త కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని లలిత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిబంధనల ఉల్లంఘన వల్లే ప్రమాదాలు

కొవ్వూరు: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించడమే రోడ్డు ప్రమాదాలకు కారణమని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ జమీర్ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వాహనాలు నడిపేటపుడు డ్రైవర్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 2రకూ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కుమారి పేర్కొన్నారు. సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ కె.బాషా తదితరులు పాల్గొన్నారు.